www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 6 నవంబర్ 2024

5

అన్నమయ్య

150 పడకల ఆస్పత్రిగా మార్చాలి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలో వందపడకల ఆస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా మార్చాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. విజయవాడలో ఆయన సత్యకుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. రాయచోటిలో ప్రజల వైద్య సౌకర్యాలను నిమిత్తంజనాభా సంఖ్యను దృష్టిలో ఉంచుకొని రాయచోటి కేంద్రంగా ప్రస్తుతం ఉన్న 100 పడకల ఆసుపత్రిని 150 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. డయాలసిస్ వ్యవస్థను 14 యూనిట్ల నుండి 20 యూనిట్లకు పెంచాలని, సాంకేతికపరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందిని మరింత పెంచి మరిన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రీసర్వే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రీ సర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, సర్వే శాఖ అధికారులతో సిసిఎల్ఎ జయలక్ష్మి, రీ సర్వే ప్రక్రియ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి కలెక్టర్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ జయలక్ష్మి మాట్లాడుతూ ఎపిలో 6,860 గ్రామాలలో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని, రీ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాలలో గ్రామసభల ద్వారా వచ్చిన సమస్యలు, అర్జీలపై జిల్లా కలెక్టర్లు, సర్వే శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన గ్రామసభలలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదరావు, ఏడీ సర్వే భరత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రైతుల ఆదాయం పెంచేందుకు కృషి

- రైతుబజార్ ప్రారంభంలో ఎమ్మెల్యే, జెసి

రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెసి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతుల ఆదాయవనరులు పెంచుకునేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జెసి ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం మదనపల్లెలో 14 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న రైతు బజారును పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే, జెసి మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలసి స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లెలో దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉన్న రైతు బజారును ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంలో కలెక్టర్, జెసిలు చూపించిన చొరవను ప్రశంసించారు. రైతులు పండించిన పంటలు నేరుగా అమ్ముకోవడానికి ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు సరసమైన ధరల్లోనే నేరుగా రైతుల ద్వారా నాణ్యమైన తాజా కూరగాయల అందించడమే లక్ష్యంగా రైతు బజార్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్ ఎడి త్యాగరాజు రైతుబజార్‌ను పునఃప్రారంభంలో క్రియాశీలకంగా వ్యవహరించారని అభినందించారు. కోమిటివాని చెరువును సుందరీరణ చేయడంలో దృష్టి సారించామన్నారు. సిటిఎం రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులకు తొలగించి 60 అడుగుల రోడ్డు వేసేలా చెట్లు తొలగించామన్నారు. మదనపల్లెలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి చట్టపరిధిలో ఆక్రమణలను గుర్తించి, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుబజార్ ఏర్పాటుకు జెసి రూ.లక్ష సొంత నిధులు సమీకరించడం అభినందనీయమన్నారు. జెసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రైతుల అభిరుచి మేరకు అన్ని మౌలిక సదుపాయాలతో రైతుబజార్‌ను అభివృద్ధి చేశామన్నారు. రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి మరింత ప్రచారాన్ని కల్పిస్తామన్నారు. కోమిటివాని చెరువును అభివృద్ధి చేయడంతోపాటు వాకింగ్ ట్రాక్, లైటింగ్, బోటింగ్ ఏర్పాటు చేయడానికి తమ పరిధిలో నిధులు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. మార్కెటింగ్ ఎడి త్యాగరాజు మాట్లాడుతూ మదనపల్లి రైతుబజార్‌ను జిల్లాకే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దడానికి కలెక్టర్, జెసిలు ప్రత్యేకంగా నిధులను కేటాయించారన్నారు. రానున్న పది రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, టమోటా మార్కెట్ కార్యదర్శి అభిలాష్, మొలకలచెరువు మార్కెట్ కార్యదర్శి జగదీష్, అగ్రికల్చర్ ఎడి శివశంకర్, జిల్లా ఉద్యానవన అధికారి పి.రవిచంద్రబాబు, మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్, హెచ్ఒ ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ ఖాజాబీ, నాయకులు ఎస్.ఎ.మస్తాన్, నాదెళ్ల విద్యా సాగర్, ముసలికుంట నాగయ్య, యర్రబల్లి వెంకటరమణరెడ్డి, ప్రభాకర్, బీదం గురునాథ్ యాదవ్, బెస్త రమణ, జివి నాయుడు, మధుసూదన్‌రెడ్డి, బాలమాలి శేఖర్, మాజీ కౌన్సిలర్ తలారి రాధమ్మ, జాఫరన్నీషా, రైతులు రాజన్న, వెంకట లక్షమ్మ, రాజశేఖర్ నాయుడు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో జెసి తనిఖీ : మదనపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలతో సమీక్ష నిర్వహించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలు, చుక్కల భూముల సమస్యలు, జాతీయ రహదారి పెండింగ్ పనులు తదితర అంశాలపై సమీక్షించి వాటిని త్వరగా పరిష్కరించే విధంగా తగు సూచనలను చేశారు. అనంతరం కోమటి వాని చెరువును సందర్శించి అధికారులకు తగు సూచనలను చేశారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయులపై నిరంతరం ఒత్తిడి పెంచి విద్యాశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్ ఎస్.జాబీర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.సుబ్రమణ్యంను యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా పలు విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ, విద్యా రంగం సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. స్కూల్ గ్రాంట్లు వెంటనే పాఠశాలల పిఎఫ్ఎం ఖాతాలకు జమ చేయాలన్నారు. 2023 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం నిధులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. 2024లో ఆంగ్లం, ఫిజికల్ సైన్స్, బయాలజీ ఉపాధ్యాయులకు డిఎ చెల్లింపు చేయలేదన్నారు. జిల్లాలో పని సర్దుబాటు ప్రక్రియ వల్ల జరిగిన అసంబద్ధాలు సవరించాలని తెలిపారు. 2022-24 సంవత్సరాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్‌లకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలన్నారు. 2024 మేలో సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. చిట్వేలు మండలంలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని చెప్పారు. చిట్వేలు మండలంలో ఉన్న 58 ప్రాథమిక పాఠశాలల్లో 40 పాఠశాలల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా, 7 పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకుండా ఉన్నాయని వాపోయారు.

డిఇఒకు పూలబొకే ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ముఖ్యంగా రాజంపేట ప్రాంతంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని చెప్పారు. పెనగలూరు, చిట్వేలు మండలాల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేడని వాపోయారు. పిజిటి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్, ప్రింటర్ వంటి పరికరాలు ఇవ్వనప్పటికీ అపార్ ఐడి తయారీ తదితర ఆన్‌లైన్ పనులు పేరుతో వారిని ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కోశాధికారి బి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పురం వెంకట రమణ, రాష్ట్ర కౌన్సిలర్ టి.శివారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, నాయకులు వెంకటయ్య, చిన్నరెడ్డప్ప,లక్ష్మీ రమణ, రాజు, వెంకట రమణ, నాగార్జున, శశి కిరణ్, నరసింహా రెడ్డి, అమీన్ పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా సౌకర్యం

- జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి రవిచంద్రబాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రబీ పంటలకు బీమా చేసుకోవడం ద్వారా రైతులకు వాటిల్లే నష్టం నుంచి గట్టెక్కవచ్చునని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు తెలిపారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మదనపల్లి డివిజనులోని ములకలచెరువు, పిటిఎం, కురబలకోట, తంబళ్లపల్లి, రామసముద్రం, నిమ్మనపల్లి మండల ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు అంగళ్లులోని స్థానిక రైతు సేవాకేంద్రంలో మంగళవారం రబీ సీజన్ 2024-25 టమోటా పంట బీమాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు హాజరై మాట్లాడుతూ ఉద్యాన పంటలలో టమోటా జిల్లాలో రెండో ప్రధానమైన పంట అని తెలిపారు. రబీ సీజనులో టమోటా సాధారణ విస్తీర్ణం 4 వేల ఎకరాలన్నారు. అక్టోబర్ 15 నుండి డిసెంబర్ 15 వరకు నాటే టమోటా పంటలకు వాతావరణ పరిస్థితులలో మార్పులు వల్ల పంట నష్టం జరిగితే రైతులకు అండగా నిలవాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ రబీ సీజన్లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. కావున రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారన్నారు. రబీ సీజన్ అక్టోబర్ 15 నుండి డిసెంబర్ 15 వరకు పంట సాగు చేసిన రైతులు ఎకరానికి రూ. 1,600 చొప్పున ప్రీమియం చెల్లించినచో రూ. 32 వేలు పంట నష్టపరిహార బీమాను పొందవచ్చని తెలియజేశారు. టమోటా పంటపై బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో అంగీకార పత్రాన్ని ఇచ్చినట్లయితే పంట రుణం నుండి బ్యాంకు నేరుగా భీమా ప్రీమియంను చెల్లించుకుంటుందని పేర్కొన్నారు. పంట రుణం తీసుకొని రైతులు నేరుగా స్వఛ్ఛందంగా కానీ లేదా కామన్ సర్వీస్ సెంటరులో కానీ రైతు సేవా కేంద్రంలో కానీ భూమి యొక్క 1బి, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రం సమర్పించి నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఇఫ్కో టోక్యో జిల్లా కో-ఆర్డినేటరుని కానీ లేదా మీ గ్రామ సచివాలయ రైతు సేవా కేంద్రం సిబ్బందిని గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఉద్యాన అధికారి ఇ.ఈశ్వర ప్రసాద్ రెడ్డి, మొలకలచెరువు ఉద్యాన అధికారి భీమేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

అనుమతుల్లేని లే అవుట్లపై చర్యలు తీసుకోండి

- మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ ప్రాంతాలలో అనుమతులు లేని లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. పికెఎం వైస్ చైర్మన్‌గా ఉన్న జెసి మంగళవారం రైతు బజార్ ప్రారంభోత్సవానికి మదనపల్లికి విచ్చేశారు. అనంతరం పికెఎం ఉడా కార్యాలయంలో మదనపల్లి, పలమనేరు, కుప్పం, పుంగనూరు, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కమిషనర్లు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా పనిచేసే సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టి వాటిని నియంత్రించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో అనుమతి లేని లేఅవుట్లు ఎక్కడెక్కడ ఎన్నెన్ని ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. మదనపల్లి కోమటివాని చెరువు సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల తగు సలహాలయ, సూచనలు చేశారు. చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లి, పుంగనూరు, కుప్పం, బి.కొత్తకోట, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గీతా జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 1వ తేదీ ఉదయం మన్నూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు పరిమళ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపి బాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ధర్మ ప్రవాచకులు కొత్త నరసింహులు, భగవద్గీత బోధకులు నారాయణ, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, శ్రీవారి భక్త సేవా సమితి అధ్యక్షులు రఘునాథ్, భగవాన్ గీత సేవా సత్సంగం కోశాధికారి నాగా వేణుగోపాల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు మనోహర్ మల్లెల హైమావతి, ఆకేపాటి మహేశ్వరమ్మ, కె.శ్రీదేవి, రాజశేఖర్, తదితరులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీతలోని ఆరవ అధ్యాయమైన ఆత్మ సంయమయోగంలోని 47 శ్లోకాలను విద్యార్థులు చెప్పాల్సి ఉంటుందన్నారు. 6, 7వ తరగతులు ఒక విభాగంగాను, 8, 9, 10వ తరగతులు మరొక విభాగంగాను పోటీలు నిర్వహించనున్నామన్నారు. 18 సంవత్సరాల లోపు వారు ఒక విభాగంగాను, 18 సంవత్సరాల పైపడినవారు మరొక విభాగంగాను సంపూర్ణ భగవద్గీతపై శ్లోకాలను పఠించవచ్చన్నారు. అన్ని విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి బహుమతులను అందజేస్తామని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి పిల్లలను తర్ఫీదు చేసి పోటీలకు పంపించాలని పేర్కొన్నారు.

ప్రేక్షకుల ఆదరణ మరువలేను

- 'క' విజయోత్సవ సభలో సినీ నటుడు కిరణ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలో సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. మంగళవారం రాయచోటిలోని గౌతమ్ థియేటర్‌లో జరిగిన 'క' విజయోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మా ఊరు అబ్బాయని గర్వంగా చెప్పుకునేలా సినిమాలలో నటిస్తున్నాను' అని హీరో పేర్కొన్నారు. 'క' సినిమా కు రోజు రోజుకూ మంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ సినిమా మంచి కుటుంబ కథా చిత్రం అని అన్నారు. ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నటించిన వారందరూ 'క' సినిమాలో నటించారని తెలిపారు. ప్రేక్షకులు తన పట్ల చూపిస్తున్న ఆదరణ, ప్రేమ ఎప్పటికీ మరువనని చెప్పారు. తాను ఒక కొత్త కథ రాస్తున్నానని, వచ్చే ఏడాదిలో రాయచోటిలోనే షూటింగ్ ప్రారంభిస్తానన్నారు. మన రాయచోటి ప్రాంతంపై తనకు విపరీతమైన ప్రేమ, అభిమానమన్నారు. అవకాశం, వీలున్నప్పుడల్లా రాయచోటి ప్రాంతానికి వచ్చి వెల్లుతుంటానన్నారు. ఈ ప్రాంత యువత వివిధ రంగాలలో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

కేక్ కట్ చేస్తున్న సినీ నటుడు అబ్బవరం కిరణ్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : 'నల్లారి'

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని సమస్యల్ని సాగదీయడం మాని సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పీలేరు మండల స్థాయి అధికారులు, కూటమి శ్రేణులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మరుగున పడిన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి శ్రద్ధ చూపాలని మండల స్థాయి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యలతో కార్యాలయాలకు వచ్చే నాయకులతోపాటు ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు అభిమాన సంఘాలు కూటమి సభ్యులు నల్లారి అభిమానుల ముందు వారి సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే నాయకులు కార్యకర్తలు ప్రజలను సమానంగా గౌరవించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తాగునీరు, మురుగునీటి కాలువల నిర్మాణం, మట్టి, సిసి రోడ్లు, ఇతర సామాజిక సమస్యలు, రైతుల వ్యవసాయ భూ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన భూ సర్వేల సమస్యలు రైతులకు గుదిబండగా మారాయని తెలిపారు. ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి రాకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో కూటమి శ్రేణులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటూ అధికారులతో కలిసి సమన్వయంతో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో తహశీల్దారు భీమేశ్వర రావు, ఎంపిడిఒ శివశంకర్, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డి బాష, శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లి బాబు రెడ్డి, పురం రామ్మూర్తి అతిక షఫీవుల్లా, చరణ్ రెడ్డి, కలప రవి, శ్రీనాథ్ రెడ్డి, రమణారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-పీలేరు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సిఐ యుగంధర్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను మంగళవారం సిఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా ప్రజల దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరు పరిసర ప్రాంతాల్లో గంజాయికి యువత అలవాటు పడ్డారని, అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సంఘం ద్వారా నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించాలని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని ప్రతి ఒక్కరు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిసంపత్ కుమార్, జిల్లా నాయకులు ఇమ్రాన్, మోహన్, పీలేరు నియోజకవర్గ నాయకులు అఖిల్, శివ, లోకేష్ పాల్గొన్నారు.

పీలేరు బాలికల గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పట్టణంలో రాయచోటి ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్ విస్తృత తనిఖీలు చేశారు. మంగళవారం పట్టణ శివారులో పీలేరు-తిరుపతి మార్గంలోని శ్రీకృష్ణదేవరాయ నూనెతల కర్మాగారం ప్రాంగణం, అందులోని బిసి బాలికల గురుకులం, స్థానిక షుకూర్ థియేటర్లను ఆయన పరిశీలించారు. ఆయిల్ సీడ్స్‌లోని భూములను గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ఆక్రమించుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పీలేరులోని తమ ప్రాంగణంలో మిగులు భూములను గుర్తించి వాటి హద్దులు చూపించాలని ఇటీవల రాష్ట్ర ఆయిల్ఫెడ్ సంస్థ జిల్లా రెవెన్యూ అధికారులను కోరింది. మంగళవారం ఆయన ఆయిల్ సీడ్స్ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. ఆయిల్ సీడ్స్ కోసం సేకరించిన భూవిస్తీర్ణం, మూతపడిన తరువాత వివిధ ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూవిస్తీర్ణం, మిగులు భూమి గురించి స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలోని మరుగుదొడ్లను కూడా పరిశీలించారు. గురుకులంలోని విద్యార్థినులకు ఒకే చోట బస, భోజనం, తరగతి గది ఉండడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గురుకులంలో మెరుగైన వసతులు కల్పనకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. అనంతరం పట్టణంలోని షుకూర్ థియేటర్ను పరిశీలించారు. థియేటర్‌లోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఎస్కేఆర్ ఆసుపత్రిలో మహిళ మరణించిన ఉదంతంపై విచారణను వేగవంతం చేయాలని సిపిఐ నాయకులు టిఎల్ వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో పీలేరు మండల తహశీల్దారు భీమేశ్వర రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న కడప జిల్లాకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9వ తేదీన కడప జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటకు రానున్నారు. పలు అభివృద్ధి పనుల పరిశీలన, ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అనంతరం తొలిసారి జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు క్రీడల్లో అత్యుత్తమంగా రాణించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14 వాలీబాల్ స్టేట్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఎంపిక విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోను సత్తా చాటాలని, తద్వారా మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సెలక్షన్లకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారు. ఎమ్మెల్యేని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఎస్ఎంసి కమిటీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, సంగం శ్రీనివాసులు, నవీన్ చౌదరి, కలకడ వేణుగోపాల్, ఎస్టీయు నాయకులు ఆర్.వి.రమణ పాల్గొన్నారు.

మురికి కూపంగా మారిన కోనేరు

దుర్గంధ భరితంగా మల్లయ్యకొండ కోనేరు

- పట్టని దేవాదాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కోనేరు దుర్గంధ భరితంగా మారింది. దేవాదాయ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో మురికి కూపంగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆలయానికి వేలాదిమంది భక్తులు వస్తుంటారని, లక్షలాది రూపాయలు భక్తులు కానుకల రూపంలో చెల్లిస్తారని చెప్పారు. కొండపై వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించి అనంతరం కోనేరులో స్నాన మాచరించి అనంతరం దర్శనానికి వెళ్తారు. కోనేరులో స్నానానికి వీలు లేకపోవడంతో కుళాయి వద్ద బకెట్‌తో నీళ్లు తెచ్చుకుని స్నానాలు ఆచరించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇంత జరుగుతున్నా దేవాదాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం భాదకరమని అన్నారు. ఈ కోనేటికి పైప్‌లైన్ ద్వారా నీళ్ల వదలడం జరుగుతుందని, కనీసం వారానికి ఒక్కరోజు శుభ్రపరచినా ఈ పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు స్పందించి కోనేరును శుభ్రం చేయించి భక్తులకు సౌకర్యవంతంగా చేయాలని కోరుతున్నారు.

నోటరీల పేరిట నిలువు దోపిడీ

- లబోదిబోమంటున్న సామాన్య ప్రజలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

విద్యాశాఖ ఇటీవల చేసిన మార్పులకు అనుగుణంగా జనన ధ్రువీకరణ పత్రం లేని విద్యార్థులు ఇంటి పేర్లతో చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలను పెట్టింది. ఇదే అదనుగా భావించి నోటరీ మంజూరు చేసేవారు రూ.250 నుంచి 300 వరకు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. బి.కొత్తకోటలో నోటరీ మంజూరు చేస్తున్న నెట్ సెంటర్లు, మీసేవ కేంద్రాలు, ఆధార్ సెంటర్లు లో నోటరీ ఇచ్చే వారు ఇష్టానుసారం నగదు వసూలు చేస్తుండడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. ఈ నోటరీల విషయమై ఉన్నతాధికారులు చొరవ చూపించి నోటరీ మంజూరు చేస్తున్న వారు అధిక మొత్తం వసూలు చేయకుండా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. తమ పిల్లలు జన్మించినప్పుడు అటు పంచాయతీలో గానీ, ఇది మున్సిపాలిటీలోగాని నమోదు చేసుకుని ఉంటే ఎటువంటి నోటరీ అవసరం లేదని సంబంధిత అధికారులు తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వారు సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కొత్తపేట విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జడ్‌పి హైస్కూల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎస్‌సిఎఫ్‌ఐ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో జరిగినటువంటి పోటీలలో కొత్తపేట విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులు విద్యార్థి ఓంకార్ అండర్-17 వాలీబాల్, అండర్క్ష్మీ17 క్రికెట్ పోటీలకుహర్షవర్ధన్ పదవ తరగతి విద్యార్థిని దినేత్ర, హారికలు బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

ఇటీవల గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ కృపావతి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 5114.76 ఎకరాల భూమి రీసర్వే సమయంలోతమ భూమి కొలతలు తక్కువ ఉన్నా ఒకరి భూమి మరొకరికి మారి ఉన్న గ్రామసభ దృష్టి తీసుకరావాలన్నారు. రీసర్వేలో తమ భూమి తక్కువ చూపిం చారని మరో ఒకరికి పోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాంటి సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఏర్పడిన వారు గ్రామసభలో అర్జీలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకుడు సురేందర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజులు దేవనాథరెడ్డి, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, విఆర్ఒ వెంకటసుబ్బయ్య రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :**గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కరించబడతాయని లక్కిరెడ్డిపల్లి మండల తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మద్దిరేవుల, ఈడిగపల్లె సచివాలయంలో రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి భూ సమస్యలు ఉన్న వారి నుంచి వినతి పత్రాలను రెవిన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్నటువంటి రీసర్వేలో తప్పులను, జాయింట్ నెంబర్లను, మీ భూమి దగ్గరికి రెవిన్యూ సిబ్బంది సర్వేయర్ తో కలిసి వచ్చి మీ సమస్యలను తీరుస్తారని తెలిపారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ మాట్లాడుతూ చాలా రోజుల నుంచి పరిష్కారం కానీ భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించి ప్రజలకు,రైతులకు న్యాయం చేయాలని ఆమె తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి , సెక్రటరీ సిరిబాబు, గ్రామ సర్వేయర్లు వేణు, ఓంప్రకాష్ రెడ్డి, మారుతి వినయ్, గౌరీ, లావణ్య సచివాలయం సిబ్బంది, టిడిపి నాయకులు ముమ్మిడి బాబుల్ రెడ్డి, కావలి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ములకలచెరువు

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ నేరాలు చిన్నారుల, మహిళలపై అత్యా చారాలపై అవగాహన సదస్సులు స్థానిక ములకలచెరువు ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ కవిత అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి, తెలంగాణ విజిలెన్స్ ఛైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి, రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎస్ఐ గాయత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగు ఆచితూచి జాగ్రత్తగా వేయాలి. సైబర్ నేరాలకు బలికాకుండా ఎంతో జాగ్రత్తగా మెలగాలన్నారు. యువత సైబర్ నేరాలకు, అసాంఘిక శక్తులకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్స్ అజ్ఞానం వల్ల కాదు కానీ అవగాహన లోపం వల్ల సైబర్ నేరాలకు గురి అవటం జరుగుతుందన్నారు. సెల్ ఫోన్, యాప్స్ జోలికి ఎప్పటికీ వెళ్ళకూడదని అన్నారు. ఎస్ఐ గాయత్రి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ఇంటర్నెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బ్యాంకు అకౌంట్, ఎటిఎం నంబర్ తెలపాలని వచ్చే సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత తాగు డుకు, డ్రగ్స్‌కు బానిసలైతే చివరికి అదో గతి పాలవు తారని అన్నారు. కార్యక్ర మంలో ఎపి మోడల్ స్కూల్, కాలేజ్ సిబ్బంది, కాలేజ్ ఛైర్ పర్సన్ కృష్ణకు మార్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)కోర్టు నందు

I.P. NO. 3/2024

కె.చంద్రశేఖర్, S/o వెంకటస్వామి, నివాసము 1/16, కమ్మపల్లి (గ్రా), కట్టావారిపల్లి (పో), పెనగలూరు (మం), అన్నమయ్య జిల్లా. ...పిటీషనర్

V/s

3.ఏదోటి రెడ్డెయ్య, S/o భాస్కర్, వయస్సు 35సం. నివాసము 1/32, కందుల వారి పల్లి (గ్రాం), చిట్వేలి (మం), అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్ నెంబర్-3

నోటీసు

పై కనబరిచిన పిటీషనరు, దివాలా కోరుచూ పై కోర్టు నందు పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. మీ హాజరు నిమిత్తం 07. 11.2024 వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉన్నది. కనుక పై తేదీన పై కోర్టు నందు మీరు గాని, మీ వకీలు ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//By order of the court//

పి. సురేష్ కుమార్,
పిటీషనర్ తరపున అడ్వకేట్,
రాజంపేట.

పిల్లల్లో అభ్యసన నైపుణ్యం పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పిల్లలలో విజ్ఞానం, అభ్యసన నైపుణ్యం పెంచేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ సైన్స్ ఎక్స్పో ప్రదర్శనలు దోహద పడతాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం మండలం కన్నెమడుగు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీ స్కూల్ సైన్స్ ఎక్స్పో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 30 అంశాలపైన ప్రదర్శనలు తిలకించారు. విభిన్న మోడల్స్ అయిన బాడీ పార్ట్స్, నా కుటుంబం, పరిసరాలు హెల్పింగ్ పీపుల్, ఆకారాలు, రంగులు, జంతు వులు, పువ్వులు, వాహనాలు, జర్మినేషన్ ప్రాసెస్, హ్యాండ్ వాషింగ్ తదితర అంశాలలో కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్తువుల గురించి, వాటి రంగులు, వాటి ఉపయోగం తదితరాలలో పిల్లల నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఎక్స్పోలో పిల్లలు చాలా ఉత్సాహంగా వారి అంశాల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల చేత క్లాస్ రూమ్‌లో బోర్డ్స్‌పై రాయించడం, చదివించడం ఒక మంచి అభ్యసన అవుతుందని అన్నారు. మొదటి ఐదు సంవత్సరాలలో పిల్లల మెదడు వృద్ధి జరుగుతుంది. ప్రీస్కూల్ సైన్స్ ఎక్స్పోలు పిల్లలకు అనేక రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయని అన్నారు. అనంతరం కలెక్టర్ తంబళ్లపల్లి క్లస్టర్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలకు గ్రీన్ బోర్డులు, డస్టర్ చాక్ పీస్ బాక్స్‌లను మంజూరు చేసి స్వయంగా అందించారు. కన్నెమడుగు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్పో ప్రదర్శ నను బాగా నిర్వ హించిన సిడిపిఒను, టీచర్లను, ఆయాలను మొత్తం బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అంగన్వాడీ టీచర్లు పిల్లల వృద్ధి కోసం బాగా కష్టపడి పని చేయాలని సూచించారు. హాజరు శాతం వాస్తవానికి దగ్గరగా ఉండా లని, ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వందశాతం హాజరు ఉండేలా కృషి చేయాలని చెప్పారు. జిల్లాలో మిగిలిన ఐసిడిఎస్ ప్రాజెక్టు అన్నీ కూడా తంబళ్లపల్లి ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకొని మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ రమాదేవి, సిడిపిఒ నాగవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

అవినీతి జరిగితే సహించేది లేదు : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీ వారీగా ప్రజల సమస్యలు, గ్రామాల అభివృద్ధిపై సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు, సెక్రటరీలు, మండల అధికారులతో చర్చించారు. మండల స్థాయి అధికారులు ముఖ్యంగా రెవెన్యూ అధికారులు అవినీతికి దూరంగా ఉండాలని, రెవిన్య సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సచివాలయం సిబ్బంది, మండల స్థాయి అధికారులు గ్రామ, మండల స్థాయి నాయకులు కార్యకర్తలతో నాయకులతో సమన్వయంగా ఉండి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కొంతమంది నాయకులు అధికారులు తీరు పట్ల ఎమ్మెల్యే కి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మాలతి, ,రెడ్డివారి యోగేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎంపిడిఒ భానుమూర్తిరావు, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ కొండయ్య వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లెలమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో పిహెచ్‌సి సాధించిన ప్రగతిని సమీక్షించారు. వ్యాక్సిన్లను నిల్వ ఉంచిన తీరును, రోగుల వార్డును, కాన్పుల గదిని పరిశీలించి తగు సూచనలు అందించారు. అనంతరం ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, లార్వా సర్వే చేసి దోమలు పెరగకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేయాలని చెప్పారు. జ్వరాలు వచ్చిన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని ఆశ కార్యకర్త వారీగా సమీక్ష నిర్వహించారు. గర్భవతులను వీలైనంత త్వరగా గుర్తించి, హైరిస్క్ గర్భిణుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ప్రతి నెల 9వ తారీకు నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పరచి, గర్భిణులకు మరింత నాణ్యమైన సేవలు అందించి పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయి శిరీష, పిహెచ్ఎన్ లలిత, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న చంద్రనాయక్, వ్యవసాయ అధికారులు

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు : జెడి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సేంద్రియ వ్యవసాయంతో రైతులు నాణ్యమైన దిగుబడులను సాధించి, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని అర్జించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన రెడ్డివారిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మదనపల్లె ఎడిఎ శివశంకర్, నిమ్మనపల్లి వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఇ-పంటలో క్షేత్రస్థాయి సిబ్బంది చేత నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఇ-పంటలో నమోదైన వివరాల ఆధారంగానే ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు, సేవలు వ్యవసాయ శాఖ ద్వారా అందడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి పంటలోనూ రైతులు విరివిగా రసాయనక ఎరువులు, పురుగుమందులను ఉపయోగిస్తున్నారని తద్వారా పంట దిగుబడితో పాటు నాణ్యత కోల్పోవడం జరుగుతుందన్నారు. భూమి సారవంతం కూడా రైతు కోల్పోతాడని వివరించారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారవంతంగా ఉంటుందని, నాణ్యమైన పంట దిగుబడి లభిస్తుందని తెలిపారు. ప్రతి రైతు సాగుచేసిన పంటలకు బీమా చేసుకోవడం ద్వారా ప్రతికూల పరిస్థితులలో పంటలను నష్టపోకుండా ఉండవచ్చని అన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు ఇ-పంట ధ్రువీకరణ పత్రాలను వంద శాతం రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో నిమ్మనపల్లె వ్యవసాయ అధికారి మురళీమోహన్, పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రెడ్డిబాబు, రెడ్డి కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని గుట్టపాలెం పంచాయతీ చీకిరాల బర్నేపల్లిలో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు విద్యుత్ లవోల్టేజ్ సమస్య ను నివారించడానికి ఈ సబ్ స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే కలికిరి మండలంలో ఎన్నో సబ్ స్టేషన్‌లను ప్రారంభించిన ఘనత నల్లారి కుటుంబానికి దక్కిందని అన్నారు. కార్యక్రమంలో పీలేరు ఇఇఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, వై.చంద్రశేఖర్‌రెడ్డి, డివైఇఇ. జ్ఞానేశ్వర్, ఎఇ బి.వసంత్‌రెడ్డి, కలికిరి డివై ఇఇ ఎం శివయ్య, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, జి.వెంకటరమణ, మాజీ ఎంపిటిసి యజేంద్ర, నాయకులు నాగరాజ,బయన్న, సింహారెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ భానుమూర్తి రాజు, సెక్రటరీ గోపి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

నైపుణ్య గణనను పక్కాగా నిర్వహించండి

- జిఎస్‌డబ్ల్యూఎస్ ఎఒ లక్ష్మీపతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నైపుణ్య గణన-2024 సర్వేను పక్కాగా నిర్వహించాలని జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఎఒ లక్ష్మీపతి పేర్కొన్నారు. మంగళవారం నిమ్మనపల్లె మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై నిర్వహించిన మండలస్థాయి శిక్షణ శిబిరంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎఒ రమేష్ బాబులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రంలోని యువత భవిష్యత్తు కోసం, నిరుద్యోగ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య గణన-2024 (స్కిల్ సెన్సెస్) సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గ్రామ స్థాయి నుంచి యువతలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన సిబ్బంది చేత మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మండల స్థాయిలో శిక్షణ అనంతరం సచివాలయ ఉద్యోగులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తి నైపుణ్యత వివరాలను సేకరించి, ఆ వివరాలను నైపుణ్యత గణన యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరిలో విద్యార్హతతో పాటు, విభిన్నమైన, ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉంటుందని, అటువంటి నైపుణ్యతను సచివాలయ ఉద్యోగులు స్వయంగా గుర్తించి నైపుణ్యత గణన యాప్‌లో సమాచారాన్ని పొందుపరచాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తుకు భరోసాను కల్పించడానికి కృషి చేస్తోందని అన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరి నైపుణ్యతను గుర్తించాలని సూచించారు. నైపుణ్య గణన సర్వేను ఎంపిడిఒ నిత్యం పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ములకలచెరువు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 11వ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీం భాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రెడ్డి కోరారు. మంగళవారం మలకలచెరువులో మంగళవారం నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక ను ప్రభుత్వ మే అన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ద్వారా సరఫరా చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పెంటర్ యూనియన్ నాయకులు ఎస్ రెడ్డి మౌలా, నారాయణస్వామి, శేషాద్రి, మౌలాలి పాల్గొన్నారు.

రెవెన్యూ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయండి : జెసి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో నిర్మిస్తున్న రెవెన్యూ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న రెవెన్యూ భవనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెవిన్యూ భవనానికి కావాల్సిన నిధులను అంచనా వేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.అంతేకాకుండా భవనాన్ని నాణ్యత ప్రమాణాలతో,సరికొత్త హంగులతో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ తహశీల్దార్ మహమ్మద్ అన్సారి, ఆర్ఐ.వీరాంజనేయులు, విఆర్ఒ వరదరాజులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

అపార్ యూనిట్ ఐడిపై అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న గోరంపాడు జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మనీషాకుమారి ఆధ్వర్యంలో ఎంపిడిఒ మల్ రెడ్డి, ఎంఇఒ రెడ్డయ్య విద్యార్థులకు అపార్ యూనిక్ కార్డ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఒక విద్యార్థికి ఐడి కింద ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) యూనిక్ ఐడి జారీ చేసేందుకు ఖచ్చితమైన డేటా రూపొందించాలని తెలిపారు. ఆధార్ కార్డు తరహాలోనే 'వన్ నేషన్- వన్‌స్టూడెంట్ ఐడి' విద్యార్థుల అకడమిక్ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డుకు రూప కల్పన చేసినట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు మాదిరే అపార్ కార్డు కు కూడా 12 అంకెల నెంబర్ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల అకడమిక్ వివరాలుతో పాటు వారి ధ్రువపత్రాలను డిజిటల్‌గా భద్రపరిచేలా అపార్ కార్డు రూపకల్పన చేసినట్లు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని కన్నెమడుగు, ఎద్దులవారిపల్లి సచివాలయాలను ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి అందే అర్జీలపై సత్వరం స్పందించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దిలీప్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

15 ఏళ్ల లోపు విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 15 ఏళ్ల లోపు బాల బాలికలు అందరికీ కొత్త ఆధార్ కార్డులో మార్పుల కోసం బర్త్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపిడిఒ జయ శ్రీ, ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తల్లిదండ్రులు అందరు తమ పిల్లలకి ఇది ఒక చక్కటి సువర్ణ అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు కావలసి ఉన్న లేదా ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాల్సి ఉన్న మీ పిల్లలు చదివే పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ ప్రధానోపాధ్యాయిని దగ్గర తీసుకొని తహశీల్దార్ కార్యాలయంలో నాన్ అవైలబుల్ సర్టిఫికేట్ ఇస్తారని చెప్పారు. అనంతరం సచివాలయానికి వెళ్లి తల్లిదండ్రుల ఆధార్‌తో పాటు పాఠశాల స్టడీ సర్టిఫికెట్, నాన్ అవైలబుల్ సర్టిఫికెట్ తీసుకొని లేట్ బర్త్ కింద సచివాలయంలో దరఖాస్తు చేసిన తర్వాత జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మండలంలోని బడికాయలపల్లి 33/11కెవి సబ్ స్టేషనులో 5 ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఇ చంద్రశేఖర్ మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్య రాకుండా నాణ్యమైన విద్యుత్ సేవలను అందిస్తామని రైతులకు ఇది ఒక శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో మదనపల్లి డిఇఇ గంగాధరం, టిఆర్ ఇఎడిఇ రమేష్, ములకలచెరువు ఎడిఇ గోవిందరెడ్డి, బి.కొత్తకోట ఎడిఇ ఎస్.గిరిబాబులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలో టిప్పర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో నిమ్మనపల్లె నుంచి బయట ప్రాంతానికి టిప్పర్ ద్వారా ఇసుకను తరలిస్తుండటంతో తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా టిప్పర్‌కు ఇసుకను లోడ్ చేసుకుని తరలిస్తుండటంతో బైరెడ్డిపల్లి మండలానికి చెందిన టిప్పర్ డ్రైవర్ శంకర, టిప్పర్ ఓనర్ అశోక్‌లను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేసినా, పెద్ద మొత్తంలో నిల్వ ఉంచినా, రాత్రి వేళల్లో రవాణా చేసిన అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని మేదరపల్లె చెక్ పోస్ట్ సమీపంలోని రేకం గార్డెన్ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని గువ్వలచెరువుకు చెందిన సయ్యద్ ఖాదర్‌వలి, నాగరాజుపల్లికి చెందిన బలరాం బైక్‌పై వెళుతుండగా కడప నుంచి రామాపురం వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీ కొట్టి వెళ్లిపోయిందన్నారు. ఖాదర్ బాషాకు తీవ్ర గాయాలు కాగా బలరాంకు గాయాలైనట్లు తెలిపారు. బాధితులు కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. బైక్‌ను ఢీ కొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోతుండగా చెక్ పోస్ట్ వద్ద పోలీసు సిబ్బంది ఆపివేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్‌టిసి బస్సు డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని జనుపువారిపల్లిలో నివాసముండే ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ(48) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రస్తుతం బైపాస్ రోడ్డు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర సొంతంగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇతని సొంత గ్రామమైన జనుపువారిపల్లిలో పొలాలు ఉన్నాయని తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి జనుపువారిపల్లికి వెళ్లి అక్కడ పొలాల్లో చింతమానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆరోగ్యం సరిగాలేకన లేదా భూతగాదాల కారణంగా చనిపోయి ఉంటాడా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలువిచారణలో తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రానికి సమీపంలోని సంత తోపు వద్ద మంగళవారం మధ్యాహ్నం ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో మర్రిపాటి రామాంజులమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నడిగడ్డ పల్లెకు చెందిన రామాంజులమ్మ చిన్నమండెంలోని ఆస్పత్రి వచ్చి చూపించుకొని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త, అత్తమామలపై కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

భర్త, అత్త మామల వేధిస్తున్నారని మంగళవారం రాంపల్లి రామతులసి అనే మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పంచాయితీ నడింపల్లి చెందిన రామతులసి 2014లో పుట్టపర్తిలో రత్నాకరన్ అనే వ్యక్తితో వివాహం అయిందని తెలిపారు. భర్త రత్నాకరన్, అత్త మామలు హింసించి వేధించి ఇంటి నుంచి తరిమి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.